క్లుప్తంగా

నేడు రక్తదాన శిబిరం

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని సుఖజీవన్ రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో బుధవారం ప్రపంచ ఫొటోగ్రఫి దినోత్సవం సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా నాయకుడు నేతాజీగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యేలు హాజరవుతారని పేర్కొన్నారు.

కాల్వకు మరమ్మతు పనులు



తాడూరు: మండలంలోని చర్లిటిక్యాలలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గ్రామాన్ని అనుసరించుకొని ఉన్న నాగులచెరువు అలుగు కాల్వ గుండా ప్రవహించడంతో కాల్వకు గండ్లు ఏర్పడ్డాయి. దీంతో గ్రామంలో ఉన్న ఇళ్ల మధ్య వరద నీరు చేరి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం నీటి ఉధృతి తగ్గడంతో కాల్వ మరమ్మతులకోసం మండల కేంద్రానికి చెందిన ఎంపీటీసీ మల్లయ్య జేసీబీ, రాజేందర్‌రెడ్డి టిప్పర్లను సమకూర్చారు. దీంతో కాల్వనీరు ఊరిలోకి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. సహకరించిన వారికి గ్రామస్తులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కల్వకుర్తిరూరల్: మండలంలోని రఘుపతిపేటకు చెందిన బాలస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సాయిరాం మెడికల్ యజమాని రాము రూ.3 వేలు సమకూర్చగా మంగళవారం మృతుడి భార్య తిరుపతమ్మకు గ్రామానికి చెందిన నార్లకంటి రాజు అందజేశారు. కార్యక్రమంలో కిష్టయ్య, రాముడు, బీమయ్య, పర్వతాలు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్షాల ధాటికి కూలిన 32 ఇళ్లు

తాడూరు: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు మొత్తం 32 ఇళ్లు కూలినట్లు డిప్యూటీ తహసీల్దార్ మహమ్మద్‌అలీ తెలిపారు. పంచాయతీ కార్యదర్శుల ద్వారా పూర్తి వివరాలు సేకరిస్తున్నామని వివరించారు. గ్రామాల వారిగా కూలిన ఇళ్ల బాధి తులను ఆదుకుంటామని పేర్కొన్నారు. ఉన్న తాధికారులకు నివేదిక పంపిస్తామని తెలిపారు.

రైతుల వివరాల సేకరణ



ఉప్పునుంతల: రుణమాఫీలో భాగంగా రేషన్ కార్డులు లేని రైతులకు సంబంధించి కుటుంబ సభ్యుల నిర్ధారణలో వ్యవసాయాధికారులు నిమగ్నమయ్యారు. డిక్లరేషన్‌తోపాటు సంబంధిత రైతుతో ఏఈఓలు సెల్ఫీ ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. మండలంలో రేషన్‌కార్డులు లేని రైతులు మొత్తం 1013 మంది ఉండగా వారిలో 800 మంది డిక్లరేషన్ అందజేసినట్లు ఏఓ రమేష్ తెలిపారు. మిగిలిన 213 మంది రైతులు త్వరగా డిక్లరేషన్ అందజేయాలని ఏఓ సూచించారు.

బహుమతులు అందజేత

అచ్చంపేట రూరల్: పట్టణంలోని భక్తమార్కండేయ పద్మశాలి కమ్యూనిటీ హాలులో 44వ నూలు పూర్ణిమ ఉత్సవాలలో భాగంగా మంగళవారం 2023–24 వ సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన పద్మశాలి విద్యార్థులకు ఆ సంఘం ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కోలాటం మాస్టర్ కర్నాటి నవీన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు పులిజాల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి కోట కిశోర్, వనం పర్వతాలు, కర్నాటి నిర్మల, మ్యాకల సత్యనారాయణ, గంజి సుధాకర్, చిలువేరు శ్రావణి, దాసుపత్రి శకుంతల పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

వెల్దండ: పౌష్టికాహారంతో ఆరోగ్యం కలుగుతుందని అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చెర్కూర్‌లో పోషక వారోత్సవాలపై అవగాహన కల్పించారు. అనంతరం బాలింతలకు, గర్భిణులకు బాలామృతం అందజేశారు. కార్యక్రమంలో ఆయాలు, మహిళలు, తదితరులు ఉన్నారు.

పందుల అపహరణ: కేసు నమోదు

వెల్దండ: మండల కేంద్రంలో 60 పందులు చోరీకి గురైన ఘటనలో మంగళవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ కురుమూర్తి వివరాల ప్రకారం రుద్రాక్ష యాదయ్యకు సంబంధించిన 60 పందులు వెల్దండ సమీపంలో కొండకత్వ సమీపంలో దొడ్లలో ఉంచాడు. గత నెల 31వ రాత్రి పందులకు మేత వేసి తిరిగి ఇంటికి వచ్చాడు. 1న పందులను చూసేందుకు వెళ్లగా పందులు కనిపించకపోవడంతో సమీప ప్రాంతాల్లో వెతికిన ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో యాదయ్య ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆదరణలేని క్రీడా ప్రాంగణాలు

- ప్రారంభంలోనే అవాంతరాలతో ప్రయోజనం చేకూరని పథకం
- పాఠశాలల్లో ఉన్న కొద్దిపాటి స్థలాలకే క్రీడాప్రాంగణాల బోర్డులు



మర్రిపల్లిలో చెరువు శిఖం భూమిలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం

ఉప్పునుంతల: గ్రామీణ యువతకు క్రీడలపై ఆసక్తి పెంచడానికి గత ప్రభుత్వం గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయడంతోపాటు క్రీడా పరికరాలను సమకూర్చినా వాటిని అధికారులు ఆదిలోనే అటకెక్కించారు. మంచి ఆట స్థలాన్ని సమకూర్చి క్రీడలపై ఆసక్తి పెంచడానికి ఉద్దేశించిన తెలంగాణ క్రీడా ప్రాంగణాలను వంతకు గంతేసినట్లు ఎంపిక చేసి వదిలేశారు. గ్రామ సమీపంలో ప్రభుత్వ స్థలాలు లేకపోవడం, అప్పట్లో ఉన్నతాధికారులు ఒత్తిడి చేయడంతో మండల స్థాయి అధికారులు చేసేదిలేక స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న కొద్దిపాటి ఆట స్థలంలోనే బోర్డులు తగిలించి వదిలేశారు. మరికొన్ని గ్రామాల్లో చెరువు శిఖం భూముల్లో, ఆటలు ఆడుకోవడానికి అనువుగా లేని స్థలాల్లో నామమాత్రంగా ప్రాంగణాలుగా చూపించి బోర్డులు తగిలించారు. అంతలోనే ప్రభుత్వం మారిపోవడంతో క్రీడా ప్రాంగణాలను పట్టించుకునే నాథుడే లేడు. మండలంలోని 27 పంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలకు స్థలాలు ఎంపిక చేసి బోర్డులు మాత్రం పెట్టారు. దాదాపుగా ఎక్కువ పంచాయతీల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న ఆట స్థలాలనే క్రీడా ప్రాంగణాలుగా ఎంపిక చేశారు. మండలంలోని మర్రిపల్లి సమీపంలోని చెరువు శిఖం భూమిలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయడంతో చెరువు నిండితే క్రీడా ప్రాంగణం నీట మునిగిపోయే పరిస్థితి ఉంది. సీబీ తండాలో క్రీడా ప్రాంగణం కోసం ఎంపిక చేసిన స్థలం బండ రాళ్లతో కూడి అనువుగా లేని స్థలంలో బోర్డును పెట్టారు. లక్ష్మాపూర్, సూర్య తండాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న కొద్దిపాటి స్థలంలోనే క్రీడా ప్రాంగణాలుగా ఎంపిక చేశారు. ఉప్పునుంతల జెడ్పీహెచ్‌ఎస్, పెనిమిళ్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉన్న ఆట స్థలాల్లోనే క్రీడా ప్రాంగణాలుగా చూపిస్తున్నారు. మండలంలో క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేయడానికి రూ.కోటికి పైగా నిధులు మంజూరు కాగా ఇప్పటివరకు 21 పంచాయతీల్లో కేవలం రూ.8 లక్షలు మాత్రమే ఖర్చు చేసి, ఎంపిక చేసిన స్థలాల్లో కొంతమేర మొరం చల్లించి తర్వాత పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం అవి పచ్చని గడ్డితో నిండి ఉన్నాయి. ఆరు పంచాయతీల్లో క్రీడా ప్రాంగణాల అభివృద్ధి పనులు మొదలుపెట్టలేదు. క్రీడా ప్రాంగణాల ఏర్పాటుతో పాటు యువకులు ఆడుకోవడానికి ప్రభుత్వం నుంచి క్రికెట్ కిట్లు, వాలీబాల్, డంబెల్స్ తదితర అన్ని రకాల ఆట వస్తువులు రాగా కొన్ని నెలల పాటు మండల పరిషత్ కార్యాలయంలో ఉంచి ఆ తర్వాత పంచాయతీలకు అందజేయగా ప్రస్తుతం ఆటవస్తువులు పంచాయతీ కార్యాలయాల్లో మూలన పడేశారు. ఇప్పటికైనా అధికారులు క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేసి ఆడుకోవడానికి మంచి వాతావరణం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

స్థలాలు అందుబాటులో లేకపోవడంతోనే..

గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల కోసం ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేకనే ఇబ్బందిగా ఉంది. స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోనే క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయడం జరిగింది. కొన్ని గ్రామాల్లో తప్పనిసరి పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న స్థలాలను ఎంపిక చేసి మట్టి, మొరం పోయించారు. నేను కొత్తగా ఆరు నెలల క్రితం ఎంపీడీఓగా ఇక్కడకు రావడం జరిగింది. ఆటలకు సంబంధించిన అన్ని రకాల సామగ్రి కిట్లు రాగా, వాటిని ఆయా పంచాయతీలకు అప్పగించాం. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తెచ్చేలా కృషి చేస్తాను.

– మోహన్‌లాల్, ఎంపీడీఓ, ఉప్పునుంతల

క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన

కల్వకుర్తిరూరల్: మండలంలోని ఎల్లికట్టలో నీటిలో మునిగిన పంటలను వ్యవసాయ శాఖ అధికారి సురేష్ మంగళవారం పరిశీలించారు. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు కేఎల్‌ఐ కాల్వ తెగి పత్తి, వరి పంటలు నీటిలో మునిగిపోయాయి. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి పంటల నష్టాన్ని అంచనా వేశారు. నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజేష్, రైతులు భూపాల్, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

తెలకపల్లి: పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్ శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కార్వంగ, తాళ్లపల్లి గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు మునిగిన పంటలను ఆయన పరిశీలించారు. వరికి ఎకరాకు రూ.30 వేలు, పత్తికి ఎకరాకు రూ.20 వేలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. జిల్లా నాయకుడు గోపస్ లక్ష్మన్, మండల నాయకులు విజయగౌడ్, రైతులు చింత వెంకటయ్య, గోరటి చంద్రయ్య, రామలక్ష్మయ్య, ఆంజనేయులు, నాగయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏఓ సురేష్

తాడూరు: నీట మునిగిన పంటల బాధిత రైతులను ఆదుకోవాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భరత్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని రైతులు సాగుచేసిన వరి పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అదేవిధంగా యాదిరెడ్డిపల్లిలోని బ్రిడ్జి దగ్గర పత్తిసాగు పూర్తిగా నీట మునిగిందని, అంతారంలో వరి, పత్తి పంటలు నీట మునిగి రైతులు నష్టపోయారన్నారు. కూలిపోయిన ఇళ్ల బాధితులకు 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు, దుస్తులు పంపిణీ చేయాలన్నారు. నాయకులు లక్ష్మన్, తిరుపతయ్య, బాలపీర్, పరశురాములు పాల్గొన్నారు.



తాడూరులో వరి పంటను పరిశీలిస్తున్న నాయకులు



తెలకపల్లిలో నీట మునిగిన పత్తి చేనులను పరిశీలిస్తున్న నాయకులు

కొనసాగుతున్న తీజ్ వేడుకలు

లింగాల: మండల కేంద్రంలోని బంజారవాడలో 9 రోజుల పాటు నిర్వహించే 'తీజ్' వేడుకలు మంగళవారం 4వ రోజు కొనసాగాయి. బంజారవాడలోని మేరమ్మ భవాన్ని ఆలయం ఆవరణలో నిర్వహిస్తున్న వేడుకల్లో 200 పైగా మొలకల బుట్టలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఉంచారు. బుట్టలలో బంజార యువతులు నియమ నిష్ఠలతో ప్రతిరోజు సాయంత్రం నీరు పోసి మొలకలను పెంచుతున్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పూజారి ఎ.బాలాజీనాయక్ ఆలయంలో కొలువు దీరిన మేరమ్మ భవానీకి పూజలు చేస్తున్నారు. ఈ నెల 8న ముగింపు వేడుకలు నిర్వహిస్తునట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.



నీటిని తీసుకొస్తున్న బంజార యువతులు

వంతెనకు మరమ్మతు

పెంట్లవెల్లి: నాలుగు రోజులుగా ఏకదాటిగా కురిసిన వర్షాలకు పెంట్లవెల్లి, మంచాలకట్ట మార్గమధ్యంలో ఉన్న వాగుపై నిర్మించిన వంతెన దెబ్బతింది. సింగోటం, రామాపురం నుంచి దిగువకు వరద పోటెత్తడంతో బ్రిడ్జి ధ్వంసం అయ్యింది. దీంతో నాలుగు రోజులపాటు మంచాలకట్ట, మాధవస్వామినగర్ గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచాయి. మంగళవారం వరద తగ్గుముఖం పట్టడంతో స్థానిక ఎస్‌ఐ, గ్రామస్తులు చొరవతో వంతెనకు మరమ్మతు పనులు చేపట్టారు. రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పనులు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



మరమ్మతు పనులు చేయిస్తున్న ఎస్‌ఐ, రైతులు

ఘనంగా పోచమ్మ బోనాలు



తెలకపల్లిలో పోతురాజుల విన్యాసాలు

తెలకపల్లి: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి పోచమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మాల సామాజిక వర్గానికి చెందిన మహిళలు బోనాలతో ఊరేగింపుగా డప్పుచప్పుళ్ల మధ్య ఆలయానికి చేరుకున్నారు. డీజేతో, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నారు. చెన్నకేశవ దేవాలయం నుంచి బయలుదేరి బొడ్రాయి, గ్రామ పంచాయతీ, గాంధీ చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తా, నెహ్రూ చౌరస్తా మీదుగా ఊరేగింపుగా కొనసాగింది. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, రామకృష్ణ, బొందయ్య, కేశవ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

లింగాల: మండలంలోని అంబట్‌పల్లి, కొత్తచెర్వు తండా, రాంపూర్ గ్రామాల్లో పోచమ్మ బోనాల పండుగ నిర్వహించారు. గ్రామ దేవతలకు బైండ్ల పూజారులతో శక్తి పూజలు చేశారు. ముందుగా బొడ్రాయి దగ్గరకు చేరుకొని ప్రదక్షిణలు చేసి పోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

8న గుండె చికిత్స శిబిరం

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ప్రశాంత్ క్లినిక్ వద్ద ఈ నెల 8న మెడికవర్ ఆస్పత్రి హైదరాబాద్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమన్‌గల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత గుండె చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, పీఆర్‌ఓ పాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్డీఓకు వినతి



కొల్లాపూర్: పట్టణంలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్స్ సముదాయ భవనాలు నిర్మించాలని బీఎస్ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి బి.దాసు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఆర్డీఓ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దాసు మాట్లాడుతూ స్థానికంగా హాస్టల్స్ నిర్మిస్తే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. హాస్టల్స్ నిర్మాణం కోసం జటప్రోల్‌లో స్థల సేకరణ కోసం అధికారులు చేస్తున్న ప్రయత్నాలు విరమించుకోవాలని కోరారు. అంజి, నవీన్, రాము, విష్ణు తదితరులున్నారు.

మూడు రోజులుగా వృథాగా నీరు



కల్వకుర్తిరూరల్: మండలంలోని తోటపల్లి సమీపంలో కేఎల్‌ఐ కాల్వకు మూడు రోజుల కిందట గండి పడింది. వరదనీరు పంట పొలాలను కోస్తూ పంటలను ముంచెత్తింది. సాగునీటి శాఖ అధికారులకు, రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందించిన ఇప్పటి వరకు కాల్వలను పరిశీలించేందుకు రాలేదని రైతులు వాపోతున్నారు. వెంటనే కాల్వలకు గండ్లు పూడ్చాలని గ్రామ రైతులు కోరారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



ఊర్కొండ: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. మంగళవారం మండలంలోని మాదారం, రాచలాపల్లి గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో నర్సరీలను సందర్శించారు. ఇంటింటికి ఆరు మొక్కలు పంపిణీ చేయాలని పంచాయతీ కార్యదర్శులకు, క్షేత్ర సహాయకులకు సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీలో జాబ్ కార్డ్ అప్‌డేషన్ పలు రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ నరసింహులు, పంచాయతీ కార్యదర్శులు కృష్ణయ్య, ఇందిర, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పారదర్శకంగా పాలన కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని కోరారు. అనంతరం నియోజకవర్గంలోని అన్ని మండలాలకు సంబంధించి 250 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ మాధవి, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చారకొండ: మండలంలోని చారకొండ, సిర్సనగండ్ల, తిమ్మాయిపల్లి, తుర్కలపల్లి తదితర గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు 27 మందికి సీఎంఆర్ఎఫ్, ఐదుగురికి కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరయ్యాయి. మంగళవారం అచ్చంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే వంశీకృష్ణ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్ గౌడ్, మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్, నాయకులు లక్ష్మణ్, నరేష్ నాయక్, నర్సిహ్మారెడ్డి , గణేష్ గౌడ్, శివ, అంజయ్య, తదితరులు ఉన్నారు.

కూలిన ఇళ్ల పరిశీలన



నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): తిమ్మాజిపేట మండలంలోని తిమ్మాయిపేటలో కుమ్మరి పార్వతమ్మకు చెందిన ఇల్లు కూలింది. ఈ మేరకు మంగళవారం ఆర్‌ఐ రవీందర్, ఇతర రెవెన్యూ సిబ్బంది గ్రామంలో పర్యటించి కూలిన ఇంటిని పరిశీలించారు. నాయకులు వెంకటరామిరెడ్డి, ఖాజామైనుద్దీన్, ముబారక్, దేవస్వామిలు పార్వతమ్మ ఉన్నారు.

ఇళ్లు మంజూరు చేయాలి

ఇటీవల కురిసిన వర్షాలకు కూలిన ఇళ్ల బాధితులకు వెంటనే ఇళ్లు నిర్మించాలని మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పాలెంలో కూలిన ఇళ్లను ఆయన పరిశీలించారు. బీఆర్ఎస్ నాయకులు సుదర్శన్‌రెడ్డి, కాశిరెడ్డి, చంద్రారెడ్డి, రవీందర్‌రెడ్డి, లక్ష్మయ్య, నాగిరెడ్డి, దామోదర్‌లు ఉన్నారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతులను, ఇళ్లు కూలిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

కనీస వేతనం చెల్లించాలని ధర్నా



పెంట్లవెల్లి: ఆశావర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఎదురుగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కరోనా కాలంలో వారు చేసిన సేవలను మరచిపోలేమన్నారు. ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం వైద్యుడు రోహిత్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకటమ్మ, శ్రీదేవి, శివలీల, శ్వేత, జ్యోతి, గీత, పుష్పలత తదితర ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ అందజేత

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రానికి చెందిన కృష్ణ, దానమ్మలు సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా వారికి రూ. 60 వేలు, రూ.12 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు మంగళవారం మాజీ ఎంపీటీసీ దండు నర్సింహ బాధిత కుటుంబసభ్యులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శశికళ శివశంకర్, సింగిల్‌విండో డైరెక్టర్ దండు చంద్రయ్య, మాజీ వార్డు సభ్యులు ఎల్లయ్య, శ్రీనివాసులు, నాగరాజు, బాలస్వామి, మల్లేష్ పాల్గొన్నారు.

రాకపోకలు పున:ప్రారంభం



లింగాల: మండలంలో నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు వరద పోటెత్తడంతో చెన్నంపల్లి, ఎర్రపెంట, పద్మన్నపల్లి గ్రామాల మధ్య రెండు రోజుల పాటు రాక పోకలు పూర్తిగా నిలిచి పోయాయి. ఆయా గ్రామాల నుంచి మండల కేంద్రానికి ప్రజలు చేరుకోలేని పరిస్థితి నెలకొంది. మంగళవారం వరద ఉధృతి తగ్గడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు కొనసాగాయి.

చెరువు కట్టను పరిశీలించిన తహసీల్దార్



పెద్దకొత్తపల్లి: వెనచర్ల పెద్ద చెరువుకట్టను తహసీల్దార్ ఈసూఫ్‌అలీ, మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్‌లు మంగళవారం పరిశీలించారు. చెరువుకు ఇరువైపులా ఉన్న అలుగులు తెగిపోవడంతోపాటు చెరువుకట్ట కూడా తెగేందుకు సిద్ధంగా ఉండటంతో నాయకులతో కలిసి సందర్శించారు. అనంతరం గ్రామంలో కూలిన ఇళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో రవికుమార్, బాలస్వామి, భాస్కర్‌రెడ్డి, శంకర్, పర్వతాలు, రాముడు పాల్గొన్నారు.

అనుమతిలేని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి



వెల్దండ: మండలంని కొట్రగేట్ వద్ద ఉన్న నడుస్తున్న ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు సంతోష్ డిమాండ్ చేశారు. మంగళవారం పాఠశాల ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు ఒక పేరుతో అనుమతి తీసుకొని మరో పేరుతో పాఠశాల నడిపిస్తున్నట్లు ఆరోపించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి అనుమతి లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వినోద్, మహేందర్, అర్జున్, నితిన్, కార్తీక్, సాయి తదితరులు ఉన్నారు.

ఆందోళనలో రైతులు

పెద్దకొత్తపల్లి: మండలంలో 60 ఎకరాలలో పత్తి, ఐదున్నర ఎకరాలలో వరి నీట మునిగినట్లు మండల వ్యవసాయ అధికారి శిరీష తెలిపారు. గ్రామానికి చెందిన బెట్టరి లింగస్వామి 10 ఎకరాల పత్తి పంట నీటిలో మునిగిందని బాధిత రైతు వాపోయాడు.

తాత్కాలిక అధ్యాపకుల నిరసన

అచ్చంపేట రూరల్: ఎస్సీ గురుకుల పాఠశాలలో తాత్కాలిక అధ్యాపకులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో తాత్కాలిక అధ్యాపకులు నిరసన చేపట్టారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. విద్యా సంవత్సరం మధ్యలో తాత్కాలిక ఉపాధ్యాయులను విధుల నుంచి తొలగించడంతో పేద విద్యార్థులు నష్టపోతారన్నారు. వారికి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సోట కాశీం, దళిత సంఘాల నాయకులు కుంద మల్లికార్జున్, చింతల రాజగోపాల్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో తాత్కాలిక అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘన సన్మానం



కల్వకుర్తిరూరల్: అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ రాష్ట్ర కార్యదర్శి గంగాధర్‌ను బీసీ సబ్ ప్లాన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో రాజేందర్, రమేష్ చారి, సదానందంగౌడ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో జెడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాల పూర్వ విద్యార్థులు

కల్వకుర్తి: పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాల పూర్వవిద్యార్థుల అపూర్వ ఆత్మీయ సమ్మేళనం మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కేబీఎన్ ఫంక్షన్‌హాలులో 1996–97 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు హాజరై ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఉద్యోగ, కుటుంబవివరాలు అడిగి తెలుసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని పూర్వవిద్యార్థులు పేర్కొన్నారు. సహపంక్తి భోజనం చేస్తూ సందడి చేశారు.